

బోరుబావిలో పడిన రెండేళ్ల బాలుడు

బెంగళూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విజయపుర జిల్లా ఇండి తాలూకా లచ్యాణా గ్రామానికి చెందిన పొలంలో పాడుబడ్డ బోరుబావిలో రెండేళ్ల బాలు డు పడ్డాడు. బుధవారం సాయంత్రం ఆటలాడుతూ ఒక్కసారిగా అదుపుతప్పి బోరుబావిలోకి పడిపోయాడు. స్థానికులు వెంటనే గుర్తించారు. బోరుబావిలో పడిన బాలుడు సాత్విక్ ముజగొండను బయటకు తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. ఎక్స్‌కావేటర్లతో బోరుబావి చుట్టూ సమాంతరంగా తవ్వకాలు ప్రారంభించారు. 500 అడుగుల మేర బోరు వేసినట్టు తెలుస్తోంది. బాలుడు ఎంత లోతులో ఉన్నాడనేది పరిశీస్తున్నారు.

కాంగ్రెస్‌ను వెంటాడుతున్న... అంతర్గత పోరు..!



- కుటుంబ రాజకీయాలపై తీవ్ర వ్యతిరేకత
- మంత్రుల వారసులపై స్థానిక నేతల గుర్రు
- ఏడు స్థానాల్లో పరిస్థితి తీవ్రం
- రంగంలోకి దిగిన అధిష్టానం

బెంగళూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్యారెంటీలతో మహిళల మనసు దోచిన కాంగ్రెస్ పార్టీ పలు సమీక్షలు, సర్వేల ద్వారా రాష్ట్రం నుంచి 14-16 స్థానాల్లో విజయం సాధించవచ్చని అంచనా వేసుకుంది. టిక్కెట్ల కేటాయింపు విషయంలో ఎక్కువ మంది మంత్రులు తమ పిల్లలు, కుటుంబ సభ్యులకు దక్కించుకోవడంతో కొంతమేర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పార్టీలో ఉండే వర్గ విభేదాలు కొంప ముంచేలా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ప్రముఖ నాయకులకు ఇతర పార్టీల్లోని నేతలతో స్నేహ సంబంధాలు కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. దీనికితోడు వర్గపోరు ఎంతటి పరిణామానికి దారితీస్తుందోనన్న ఆలోచనలో పడ్డారు. కొందరు భవిష్యత్తు రాజకీయాల్లో ఎదురు లేకుండా ఉండాలంటే ఇప్పుడు వారిని ఓడించాలనే ఆలోచనలో కూడా ఉన్నట్టు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికలు ముగిసినప్పటి నుంచి పార్టీ పరంగా సర్వేలు జరుపుతున్నారు. ఏఐసీసీ నేతలకు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా వివరించినట్టు తెలుస్తోంది. బెళగావిలో కుటుంబ రాజకీయాలపై పెను దుమారమే ఉన్నట్టు సమాచారం. బెళగావి నుంచి మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ కుమారుడు మృణాల్ అభ్యర్థి అయ్యారు. ఇప్పటికే లక్ష్మీ హెబ్బాళ్కర్ తమ్ముడు ఎమ్మెల్సీగా వ్యవహరిస్తున్నారు. ఒకే కుటుంబానికి నెలల వ్యవధిలోనే మూడు కీలక పదవులు కేటాయిస్తే పార్టీకోసం నిరంతరంగా పనిచేసేవారు ఏం కావాలనే విమర్శలు జోరందుకున్నట్టు తెలుస్తోంది. ఇక బాగల్కోటెలో స్థానికేతర అభ్యర్థి సంయుక్త పాటిల్‌కు టిక్కెట్ ఇవ్వడంపై వీణాకాశప్ప బహిరంగంగానే రచ్చకెక్కిన విషయం తెలిసిందే. ఆమె ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే కాంగ్రెస్ అభ్యర్థి సంయుక్త పాటిల్ విజయం అంత సులువు కాదు. కోలారు విషయంలో సాగిన రాజకీయం ఇంకా సద్దుమణగలేదు. పార్టీ సీనియర్ నేతలు మంత్రి కేహెచ్ మునియప్ప, మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ వర్గాలు కలవకపోతే ఇక్కడ గెలుపు అసాధ్యమనే సంకేతాలు వెలువడ్డాయి. బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి కావడంతో ఆచితూచి వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తుమకూరులో ముద్దహనుమేగౌడ పార్టీకి వెనుతిరిగి రావడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. గత ఎన్నికల్లో టిక్కెట్ దక్కనందుకు పార్టీకి దూరమై ప్రస్తుతం ఎన్నికలంటూ టిక్కెట్ సాధిస్తే ఆయనకు ఎందుకు మద్దతు ఇవ్వాలని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇక సీఎం సొంత జిల్లా మైసూరులో బీజేపీ నుంచి యువరాజు యదువీర్ అభ్యర్థి కావడంతో ఆయనకు ధీటైన వ్యక్తిని రంగంలోకి దింపాల్సి ఉండేది. కానీ పార్టీ అధికార ప్రతినిధి లక్ష్మణ్‌కు టిక్కెట్ ఇచ్చారు. ఒక్కలిగ సామాజిక వర్గానికి చెందినవారైనా ప్రజాభిమానం చూరగొనడంలో ఆయన వెనుకంజలో ఉన్నారు. బెంగళూరు గ్రామీణ నుంచి డీకే సురేశ్‌కు మరోసారి టిక్కెట్ ఇచ్చారు. అనూహ్యంగా బీజేపీ రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే అత్యుత్తమ వైద్యుడిగా పేరొందిన సీఎన్ మంజునాథ్‌ను బరిలోకి దింపడంతో పోటీ రసవత్తరమైంది. చిక్కబళ్లాపురలో రక్షా రామయ్యకు టిక్కెట్ కేటాయించారు. ఇదే స్థానం కోసం సీనియర్ నేతలు వీరప్పమొయిలీ, శివశంకరరెడ్డి ప్రయత్నించారు. బీదర్ స్థానం నుంచి మంత్రి ఈశ్వర్‌ఖండ్రె కుమారుడు సాగర్‌ఖండ్రెకు టిక్కెట్ ఇచ్చారు. సాగర్ వయస్సు 26 ఏళ్లు. బీదర్‌లో పార్టీ కోసం పనిచేసినవారే లేరనే రీతిలో మంత్రి కుమారుడికి టిక్కెట్ కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాజధానిలో... ఉక్కపోత!

- బెంగళూరులో 37 డిగ్రీలు నమోదు
- మూడేళ్లలో అత్యధికం

బెంగళూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరులో ఎండలు మండిపోతున్నాయి. నాలుగురోజులుగా వరుసగా ఎండలు పెరగడంతో ఉక్కపోతతో జనం సతమతమవుతున్నారు. ఆదివారం 36.6 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా మంగళవారం ఏకంగా 37.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం అదే ఉష్ణోగ్రతలు కొనసాగాయి. నగర వ్యాప్తంగా ఉష్ణోగ్రత పెరగడంతో మధ్యాహ్నం వేళ రోడ్లు వెలవెలబోతున్నాయి. గడిచిన మూడేళ్లతో పోలిస్తే ఇదే రికార్డుగా ఉన్నట్టు వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది. 2021 ఏప్రిల్ 21న 37.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మూడేళ్ల తర్వాత అదే స్థాయి ఉష్ణోగ్రతలు కొనసాగాయి. అంతకుముందు 2017లో 37 డిగ్రీలు, 2012లో 37.5 డిగ్రీలు నమోదైంది. 2016లో 39 డిగ్రీలు అత్యధికంగా ఉంది. వరుసగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా, మరోవారానికిపైగా ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది. ఎండలు పెరగడంతో వేడిగాలులు వీస్తాయని, వీటి నుంచి రక్షణగా ముందుజాగ్రత్తలు పాటించాలని సూచించారు. బెంగళూరుతోపాటు చిత్రదుర్గ, దావణగెరె, తుమకూరు, చిక్కబళ్లాపుర, కోలారు, మండ్య, చామరాజనగర జిల్లాల్లోనూ వేడిగాలులు నమోదయ్యాయి. గురువారం 38 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు ప్రకటించారు.

ఎండలతో జనం ఉక్కిరి బిక్కిరి

బళ్లారి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. ఇంటిలో ఉంటే ఉక్కపోత.. బయట కాలు మోపితే ఎండ మంటలతో జనం సతమతమవుతున్నారు. పగలు ఇంటిలో ఫ్యాన్ గాలి కూడా వేడి పుట్టిస్తుండడంతో జనం అల్లాడిపోతున్నారు. బుధవారం బళ్లారిలో 41 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. ఉదయం 10 గంటలకే 36 నుంచి 37, మధ్యాహ్నం 12 గంటలకు ఏకంగా 41 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. మార్చి చివరి వారం నుంచి బళ్లారిలో ఎండ వేడిమి పెరిగింది. పైగా తారురోడ్లు వేగంగా వేడెక్కుతున్నాయి. రోడ్లపై ద్విచక్రవాహనాల్లో వెళ్లేందుకు కూడా జంకే పరిస్థితి నెలకొంది. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కంపెనీలు, ఇతర కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. సాయంత్రం 7 గంటలయినా వేడి తగ్గడం లేదు. రాత్రి పూట ఇళ్లలో ఫ్యాన్ వేసుకున్నా వేడి గాలి వీస్తుండడంతో జనం కంటికి కునుకు లేకుండా రాత్రిళ్లు గడుపుతున్నారు.



ప్రధానిని చేస్తామన్నా బీజేపీవైపు వెళ్లను

- దళితులు, మహిళలకు ఆర్‌ఎస్‌ఎస్‌లోకి ప్రవేశం లేదు
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య



బెంగళూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేశానికి ప్రధానమంత్రిని చేస్తామని హామీ ఇచ్చినా బీజేపీవైపు వెళ్లేది లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పష్టం చేశారు. సిద్ధాంతపరమైన స్పష్టత ఉన్నప్పుడే రాజకీయశక్తి సాధ్యమవుతుందన్నారు. బుధవారం మైసూరు కాంగ్రెస్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎం. లక్ష్మణ్ తరపున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ గర్భగుడిలోకి దళితులు, శూద్రులు, మహిళలకు ప్రవేశమే లేదన్నారు. మోదీ ప్రధాని అయితే దేశం వీడుతానన్న దేవెగౌడ ఇప్పుడు ఆయనతోనే అవినాభావ సంబంధం అంటున్నారని, రాజకీయ నేతలకు సిద్ధాంతపరమైన స్పష్టత ఉండాలని హితవు పలికారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు సామాజిక న్యాయం అంటే పట్టదని, రిజర్వేషన్ అంటే ఇష్టపడరని విమర్శించారు. రిజర్వేషన్ అనేది భిక్ష కాదని, వెనుకబడిన వర్గాల హక్కు అన్నారు. మైసూరు అభ్యర్థి ఎం. లక్ష్మణ్ నామినేషన్ దాఖలులో భాగస్వామ్యులయ్యారు. ఆ తర్వాత చామరాజనగర అభ్యర్థి సునిల్‌బోస్ నామినేషన్‌లోనూ పాల్గొన్నారు. సీఎంతో పాటు మంత్రులు మహదేవప్ప, వెంకటేశ్, పరమేశ్వర్‌తోపాటు పలువురు భాగస్వామ్యులయ్యారు.



రాజీనామా చేసి బరిలోకి దిగుదాం

- సిద్దరామయ్యకు జీటీ దేవెగౌడ సవాల్

బెంగళూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, జేడీఎస్ రాష్ట్రనేతలనే కాకుండా ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై నిత్యం విరుచుకుపడే సీఎం సిద్దరామయ్యకు చాముండేశ్వరి ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ తిరుగులేని సవాల్ విసిరారు. చాముండేశ్వరి నియోజకవర్గానికి జీటీ దేవెగౌడ ఏం సాధించారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య వ్యాఖ్యలపై జేడీఎస్ ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ తీవ్రంగా స్పందించారు. మైసూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఏం చేశాననేది ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. వరుణ నుంచి సిద్దరామయ్య ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, తాను చాముండేశ్వరిలో రాజీనామా చేస్తానని తెలిపారు. ఇద్దరం కలసి చాముండేశ్వరిలో పోటీ చేద్దామని, ఎవరు గెలుస్తారో చూద్దామంటూ సవాల్ చేశారు. అభివృద్ధి అంటే ఏమిటో సిద్దరామయ్యకు తెలియదన్నారు. ముఖ్యమంత్రిగా చాముండేశ్వరికి ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చాముండేశ్వరి ఉప ఎన్నికల్లో తాను జేడీఎస్ తరపున ప్రచారానికి వెళ్లలేదని, అందుకే మీరు గెలిచారన్నారు. చాముండేశ్వరి నుంచి ఓడించాలని ఎన్నోసార్లు ప్రయత్నించారన్నారు. గడిచిన ఎన్నికల్లో చాముండేశ్వరి నుంచి ఓడించానన్నారు. ఎంతకాలం సీఎంగా ఉంటారో, ఈ అధికారం ఎన్ని రోజులో తెలుస్తుందన్నారు. గడిచిన ఎన్నికల్లో 35వేల ఓట్ల తేడాతో సిద్దరామయ్యను ఓడించానని, అప్పుడు తాను ఆయనను అవమాన పరిచేలా మాట్లాడలేదన్నారు.

ఎన్నికల్లో పోటీ చేయను

- త్వరలోనే బీజేపీలో చేరుతా
- మండ్య ఎంపీ సుమలత

బెంగళూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ మండ్య స్వతంత్ర ఎంపీ సుమలత నిర్ణయంపై రాజకీయ ఉత్కంఠతకు తెరపడింది. మండ్యలో బుధవారం కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేది లేదని, త్వరలోనే బీజేపీలో చేరుతానని ప్రకటించారు. మండ్య నియోజకవర్గంతో సంబంధాలను దూరం చేసుకోలేనని, ఇది తమ కుటుంబానికి సెంటిమెంట్ అన్నారు. ఇక్కడి నుంచే అంబరీశ్ రాజకీయాల్లో రాణించారని గుర్తు చేసుకున్నారు. స్వతంత్రంగా పోటీ చేసే ఆలోచన లేదన్నారు. ఐదేళ్లపాటు ఎంపీగా శాయశక్తులా పనిచేశానని, రాజకీయాల్లో కొన్ని నిర్ణయాలు తీసుకోక తప్పదన్నారు. స్వతంత్ర ఎంపీగా ఉన్నా రూ.4వేల కోట్ల గ్రాంటు తెచ్చానని పేర్కొన్నారు. బీజేపీ ప్రతి విషయంలోనూ తనను విశ్వాసంలోకి తీసుకుందని, మీ నాయకత్వం కావాలని స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారని అన్నారు. నాయకత్వాన్ని పెంపొందించే గుణం బీజేపీలో ఉందన్నారు. బీజేపీలో చేరడంలో తన స్వార్థం లేదని, లాభం కోసం ప్రయత్నించి ఉంటే మరో నియోజకవర్గాన్ని ఎంచుకుందునని, అలాంటి నిర్ణయం తీసుకుని ఉంటే మండ్యను వదులుకోవాల్సి ఉండేదన్నారు. రాజకీయాలు చేస్తే మండ్యలో మాత్రమే అనే నిర్ణయంతోనే కొనసాగానని అన్నారు. అంబరీశ్ అభిమానులను వదిలి వెళితే మండ్య కోడలు అనిపించుకోవడం సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్‌లో చేరాలని కొందరు సూచించారని, మరికొందరు సుమలత అవసరం కాంగ్రెస్‌కు లేదని చెప్పారన్నారు. అంబరీశ్ ఉన్నప్పుడు కూడా ఇదే తరహాలో వ్యవహరించారని, తనకు గౌరవం లేని కాంగ్రెస్‌లోకి వెళ్లాలా... అంటూ ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే బీజేపీ పరోక్షంగా మద్దతు ఇచ్చి అభ్యర్థిని నిలపలేదన్నారు. ప్రస్తుతం బీజేపీ-జేడీఎస్‌తో పొత్తులో భాగంగా మండ్యను వదులుకున్నానని అన్నారు. చివరిక్షణం దాకా మండ్య కోసం ప్రయత్నించానని, సాధ్యం కాలేదన్నారు. బెంగళూరు ఉత్తర, చిక్కబళ్లాపుర, మైసూరు టిక్కెట్ ఇస్తామని సూచించారని, మండ్యను విడిచి ఎక్కడికి వెళ్లదలచుకోలేదని, ఓడినా గెలిచినా చివరకు ప్రాణం పోయినా మండ్యలోనే అంటూ తేల్చి చెప్పారు. సుమలత పోటీ చేసేది లేదని, ప్రత్యేకించి బీజేపీలో చేరతానని ప్రకటించడంతో మండ్య జేడీఎస్-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి హెచ్‌డీ కుమారస్వామికి కొండంత బలం దక్కినట్టయింది. మూడు రోజుల క్రితమే కుమారస్వామి పాత రాజకీయ విభేదాలను వదిలి నేరుగా సుమలత ఇంటికెళ్లి చర్చలు జరిపిన సంగతి విదితమే.



మండ్యలో మీడియాతో మాట్లాడుతున్న సుమలత



ఇఫ్తార్ : గురువారం సాయంత్రం 6:33
సెహరి : శుక్రవారం ఉదయం 04:59

పోటాపోటీగా నామినేషన్లు

- 87 మంది 116 సెట్ల దాఖలు
- చామరాజనగర, మైసూరులో భారీ ర్యాలీలు
- నేటితో ముగియనున్న తొలి విడత నామినేషన్లు

బెంగళూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో తొలి విడతకు జరిగే 14 నియోజకవర్గాలలో పోటాపోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. బుధవారం 87 మంది 116 సెట్ల నామినేషన్లు వేశారు. వీరిలో 82 మంది 108 సెట్ల నామినేషన్ దాఖలు చేయగా, ఐదుగురు మహిళలు 8 నామినేషన్లు సమర్పించారు. ఇప్పటి వరకు 184 మంది పురుషులు 243 నామినేషన్లు దాఖలు చేయగా, 15మంది మహిళలు 25 సెట్ల నామినేషన్లు వేశారు. మొత్తంగా 199 మంది అభ్యర్థులు 268 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు రెండు మూడు సెట్ల నామినేషన్లు వేశారు. నామినేషన్ల గడువు సమీపిస్తున్న తరుణంలో బుధవారం పెద్దఎత్తున స్వతంత్రులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బెంగళూరు ఉత్తర అభ్యర్థి రాజీవ్‌గౌడ, బెంగళూరు సెంట్రల్ నుంచి మన్సూర్ అలిఖాన్, మైసూరు నుంచి లక్ష్మణ్, చామరాజనగర నుంచి సునిల్‌బోస్ నామినేషన్లు వేయగా బీజేపీ తరపున ఉడుపి-చిక్కమగళూరు అభ్యర్థి కోట శ్రీనివాసపూజారి, చామరాజనగర అభ్యర్థి ఎస్. బాలరాజు, తుమకూరు అభ్యర్థి సోమణ్ణ, బెంగళూరు ఉత్తర అభ్యర్థి శోభాకరంద్లాజె నామినేషన్లు వేశారు. మైసూరు అభ్యర్థి యదువీర్ ఇప్పటికే సాంకేతికంగా నామినేషన్ దాఖలు చేయగా బుధవారం భారీ రోడ్‌షో నిర్వహించి నామినేషన్ సమర్పించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, జేడీఎస్ నేత కుమారస్వామి, ఎంపీ ప్రతాప్‌సింహ తదితరులు పాల్గొన్నారు. శోభాకరంద్లాజె నామినేషన్‌లో ఎమ్మెల్యే గోపాలయ్య, చలవాది నారాయణస్వామి, మునిరాజు తదితరులు పాల్గొన్నారు. తుమకూరులో సోమణ్ణ నామినేషన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీలో యడియూరప్ప, అశోక్, శ్రీరాములు, కుమారస్వామి, జనార్దనరెడ్డి, జేసీ మాధుస్వామి తదితరులు భాగస్వామ్యులయ్యారు. చిక్కబళ్లాపుర నియోజకవర్గం నుంచి యలహంకకు చెందిన చేనేత కార్మిక సంఘం నాయకుడు చిన్నప్ప అనుచరులతో కలసి నామినేషన్ వేశారు. చేనేత కార్మికులు, పేదల పట్ల రాజకీయపార్టీలకు చిత్తశుద్ధి లేదని, అందుకే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశానని ఆయన తెలిపారు.

నేటితో తొలి విడత ముగింపు

లోక్‌సభ ఎన్నికల ప్రధానఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగియనుంది. 14 నియోజకవర్గాల్లో ఈనెల 26న పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి నామినేషన్ల దాఖలుకు చివరి రోజు. శుక్రవారం పరిశీలన ప్రక్రియ సాగనుండగా, ఆ తర్వాత నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది.



మైసూరులో బీజేపీ అభ్యర్థి యదువీర్ నామినేషన్‌లో కుమారస్వామి, విజయేంద్ర తదితరులు



నామినేషన్ వేస్తున్న బెంగళూరు సెంట్రల్ కాంగ్రెస్ అభ్యర్థి మన్సూర్ అలిఖాన్




బెంగళూరు ఉత్తర బీజేపీ అభ్యర్థి శోభాకరంద్లాజె



బెంగళూరు ఉత్తర కాంగ్రెస్ అభ్యర్థి రాజీవ్ నామినేషన్



మైసూరు కాంగ్రెస్ అభ్యర్థి ఎం లక్ష్మణ్ నామినేషన్‌లో సీఎం సిద్దరామయ్య తదితరులు




తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1580.16	1,583.81
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	926	5,823
సామర్థ్యం (టీఎంసీలు)	4.54	6.57

భద్ర జలాశయం నుంచి తుంగభద్రకు నీరు

- సకాలంలో స్పందించిన జిల్లా యంత్రాంగం
- గ్రామాలకు తొలగనున్న తాగునీటి కష్టాలు



భద్ర రిజర్వాయర్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 3: తుంగభద్ర నది ఈ ఏడాది ప్రారంభంలోనే నీరు అడుగంటిపోయింది. దీంతో బళ్లారి జిల్లాలోని చాలా గ్రామాలు తాగునీటి కోసం అలమటిస్తున్నాయి. ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో నదులు పూర్తిగా ఎండిపోయాయి. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రభుత్వాన్ని సంప్రదించి భద్ర జలాశయం నుంచి తుంగభద్ర నదికి రోజూ 3వేల క్యూసెక్కుల చొప్పున 2టీఎంసీల నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. స్పందించిన ప్రభుత్వం మూడు నాలుగు రోజులక్రితమే నదిలోకి నీటిని విడుదల చేయించింది. హరిహర దాటి తుంగభద్ర నదిలో నీరు ప్రవహిస్తున్నాయి. మరో 2 రోజుల్లో జిల్లాలోకి ప్రవేశిస్తుందని తుంగభద్ర బోర్డు అధికారులు తెలిపారు. నదిలోకి నీటిని విడుదల చేయడంతో నదీ పరివాహక గ్రామాల ప్రజలు నదిలోకి దిగవద్దని విజయనగరం జిల్లాయంత్రాంగం హెచ్చరించింది. వేసవి పంటలకు కూడా నీరందకుండా అధికారులు జాగ్రత్తలు చేపట్టారు. కొన్ని చోట్ల గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కోసం గొట్టపు బావుల భూగర్భ జలమట్టం 400-600 అడుగులకు పడిపోయాయి. గొట్టపు బావుల నీరు కూడా తాగడానికి సరిపోవడం లేదని ప్రజలు అంటున్నారు. కొన్నిచోట్ల నీటి వనరులు ఉన్నా వాటిని వినియోగించుకోవడంలో జాప్యం జరుగుతోంది.

ఓటు హక్కును వినియోగించుకోండి: నోడల్ అధికారి



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

బళ్లారి సిటీ, ఏప్రిల్ 3: ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బళ్లారి తాలూకా స్వీప్ నోడల్ అధికారి మాదగిన బసప్ప సూచించారు. మే 7న జరిగే పోలింగ్‌లో ఓటర్లను పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాఎన్నికల అధికారి కార్యాలయం, స్వీప్ కమిటీ, పరిపాలనాధికారి, పంచాయతీ, మహానగర పాలె, తాలూకా పంచాయతీల ఆధ్వర్యంలో 93-బళ్లారి రూరల్ నియోజకవర్గంలో ఓటింగ్‌పై అవగాహన జాతాను ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఓటు వేయడం అనేది పౌరులందరి హకుక అన్నారు. ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగకుండా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని సూచించారు. ఓటు అవగాహన జాతా నగరంలోని బెల్లల్ క్రాస్ సర్కిల్ నుంచి ప్రారంభమై కౌల్‌బజార్ మెయిన్ రోడ్డు మీదుగా మొదటి గేటు వరకు సాగింది. జాతాలో హెల్‌లైన్ నంబర్ 1960 సీ.విజిల్ యాప్, ఇతర సమాచారంతో కూడిన బోర్డుల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బళ్లారి మహానగర పాలికె జోన్-3 కమిషనర్, కార్పొరేషన్ సిబ్బంది, బూత్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కంప్లి: ఓటు హక్కును ప్రతి ఓటరూ సద్వినియోగం చేసుకోవాలని వివిధ శాఖల అధికారులు పట్టణంలో బుధవారం సైకిల్ జాతా నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికలు మే 7న జరగనున్న నేపథ్యంలో తహసీల్దార్ శివరాజు, ఈవో శ్రీకుమార్, రమేష్ బాబు, పురసభ ముఖ్య అధికారి రాయనగౌడ, వివిధ శాఖల సిబ్బంది పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.



కంప్లిలో సైకిల్ జాతా చేపట్టిన అధికారులు

జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించుకుందాం

సిరుగుప్ప, ఏప్రిల్ 3: మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ రాజేశ్వరి తెలిపారు. బుధవారం తాలుకా పరిపాలనా, జిల్లా పరిషత్, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆయన భావ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్ ఉన్నందున సరళంగా ఆచరిస్తున్నట్లు తెలిపారు. వివిధ శాఖల ప్రభుత్వాధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె కోరారు.

జేడీఎస్-బీజేపీ మైత్రి ముందు కాంగ్రెస్ బలాదూర్

- బీజేపీ జిల్లాధ్యక్షుడు, శివరాజ్ పాటిల్

రాయచూరు, ఏప్రిల్ 3: జిల్లాలో రాజకీయంగా బలమైన శక్తులుగా ఉన్న భారతీయ జనతాపార్టీ, జనతాదళ్(ఎస్) ఏకమై ఎన్నికల బరిలోకి దిగితే కాంగ్రెస్ గాలిలో కొట్టుకుపోవడం ఖాయమని బీజేపీ జిల్లాధ్యక్షుడు, సిటీ ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటిల్ అన్నారు. లోకసభ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్‌లు సంయుక్తంగా పోటీ చేస్తున్న నేపథ్యంలో బుధవారం నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో రెండు పార్టీల నాయకుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మితభాషి అయిన సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్‌కు పార్టీ నాయకత్వం మరోసారి అవకాశం కల్పించిందన్నారు. ఆయన సేవలు నియోజకవర్గానికి అవసరమని గడచిన ఐదేళ్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన తనవంతు తోడ్పాటునందించరన్నారు. ఆయన గెలుపు కోసం బూత్‌స్థాయిలో రెండు పార్టీల కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేయాలన్నారు. అలాగే దేశానికి ప్రధాని నరేంద్ర మోదీ సేవలు అవసరమని ఆయన గెలుపు కోసం ఇక్కడ మరింతగా కష్టపడి పనిచేయాలన్నారు.

నేడు జయహో బీసీ

రొళ్ల, ఏప్రిల్ 3: మండల కేంద్రంలో గురువారం టీడీపీ జయహో బీసీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ వీఎంపాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ, బీజేపీ, టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న హాజరు కానున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

- సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి

అగళి, ఏప్రిల్ 3: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని సీడబ్ల్యుసి మెంబర్ నీలకంఠాపురం రఘువీరారెడ్డి పేర్కొన్నారు. స్వగృహంలో అగళి మండలం ఇరిగేపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వారందరికీ రఘువీరారెడ్డి కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అభ్యర్థి సుధాకర్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఎట్టకేలకు మడకశిరలో కాంగ్రెస్ పార్టీ గెలవాలన్నారు. నేను కూడా ప్రతి గ్రామానికి తిరిగి ప్రచారం చేపడతానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషంతో ఉంటారన్నారు. ఈ సందర్భంగా సత్యసాయిజిల్లా ఉపాధ్యక్షలు రాజ్‌కుమార్, మండల కన్వీనర్ లోకేష్, యూత్ అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఇరిగేపల్లి డైరీ గోవిందప్ప, నర్సే గౌడ్, నరసప్ప, వెన్నసప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 3: పేదలకు అన్ని విధాలుగా అందుబాటులో ప్రభుత్వ ఆసుపత్రులు ఉండాలని, అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలని శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి పేర్కొన్నారు. ఆయన బుధవారం పట్టణ పరిధిలోని ప్రభుత్వ జిల్లాస్థాయి ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడారు. ఇక్కడ అందుతున్న సౌకర్యాలు, వైద్యులతీరు, మందులు అందుబాటులో ఉండడం తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేది వందశాతం పేదలే అన్నారు. అలాంటి ఆసుపత్రుల్లో ఏ ప్రభుత్వమైనా మెరుగైన వైద్య సౌకర్యాలు అం దించాలన్నారు. హిందూపురం జిల్లా స్థాయి ఆసుపత్రి ఉమ్మడి జిల్లాలో అనంతపు రం తరువాతి స్థానంలో ఉందన్నారు. మరి అంతటి స్థాయి ఉన్న ఈ ఆసుపత్రిలో ఏళ్ల తరబడి సీటీ స్కానింగ్ యంత్రం మూలన పడిందన్నారు. గుండె చికిత్సా విభాగంలో సీలింగ్ ధ్వంసమైందని, వర్షం వస్తే నేరుగా నీరు రోగుల మీద పడే అవకాశం ఉందన్నారు. డయాలసిస్ విభాగంలో ఏసీలు పని చేయక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎలుకలు రాజ్యమేలుతుంటే వాటిని చర్యలు చేప ట్టాల్సిన విభాగం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించకపోతే ఉద్యమిస్తానని స్వామి హెచ్చరించారు.

స్థానికేతరుడికి కాంగ్రెస్ ఎంపీ టిక్కెట్

- బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్

రాయచూరు, ఏప్రిల్ 3: లోకసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీకి జిల్లాకు చెందిన అభ్యర్థే దొరకలేదని బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ ఎద్దేవా చేశారు. ఎన్నికల సందర్భంగా రెండు పార్టీల జనతాదళ్(ఎస్), బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశం అనంతరం బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో అనేక మంది జిల్లాధికారులుగా రాయచూరులో పనిచేసి వెళ్లారని ప్రస్తుతం లోకసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీ కుమార్ నాయక్ అందులో ఒకరన్నారు. ఆయన బెంగళూరుకు చెందిన వారుకాగా స్థానికేతరుడు అన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన ఐదు గ్యారెంటీల గురించి తప్పా వేరే అభివృద్ధి గురించి మాట్లాడే పరిస్థితి లేదన్నారు. ఏ రకమైన అభివృద్ధి కార్యక్రమం చేయాలన్నా ఖజానాలో నిధులు లేవని, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిలో వెనకబడి పోయిందని ఆరోపించారు. మరో సారి బీజేపీకి అండగా నిలిచి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయనఅభ్యర్థించారు. మిత్రపక్షాలుగా లోకసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న జేడీఎస్-బీజేపీ నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన సమావేశానికి మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బీవీ నాయక్ గైర్హాజరయ్యారు. దీనిపై స్పందించిన రెండు పార్టీల నాయకులు త్వరలోనే ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి



బహుమతులు అందకున్న విద్యార్థులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 3: స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. శివాజీ మహారాజ్ 344వ జయంతి సందర్భంగా తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జాతీయత, దేశభక్తితో పాటు మంచి నడవడిక, సద్గుణాలను అలవర్చుకోవాలన్నారు. దీపిక, అయ్యన గౌడ, సుప్రియ, గవిసిద్ద, శశమ్మ ఉమ్మెహాని, శ్వేత, విద్యార్థి ప్రతినిధి మహేశ్, లావణ్య, పల్లవి పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు



పొలాల్లోకి వెళ్లిన బస్సు నుంచి దిగుతున్న ప్రయాణికులు

సిరుగుప్ప, ఏప్రిల్ 3: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన మేరకు బుధవారం బళ్లారి నుంచి సిగుప్పకు వస్తున్న ఆర్టీసీ బస్సు సిరుగుప్ప తాలుకా భైరాపుర గ్రామం వద్దకు రాగానే బస్సు డ్రైవర్ స్టీరింగ్‌లో లోపమున్నట్లు గమనింగా బస్సు అప్పటికే పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో చిన్నపాటి గాయాలు తగిలిన వారికి టెక్కలకోట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సు పొలాల్లోకి వెళ్లింది. దీంతో ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది.

బసవరాజ్‌కు సమాజ సేవారత్న అవార్డు



బసవరాజ్‌ను సత్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 3: కర్ణాటక హిస్టరీ అకాడమీ బళ్లారి జిల్లా అధ్యక్షుడు టి.హెచ్.ఎం బసవరాజ్‌కు సమాజ సేవారత్న అవార్డు వరించింది. జిల్లాలోని సిరుగుప్ప తాలూకా బంద్రాలు గ్రామంలో గురు పుట్టరాజ గవాయి అధ్యాత్మిక, విద్యా ట్రస్ట్ పంపాయ పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రారంభోత్సవంలో బసవరాజ్‌ను రాష్ట్రస్థాయి సమాజ సేవారత్న అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో సిరుగుప్ప బసవభూషణస్వామి, లలిత నారాయణ, శిల్ప, రాజశ్రీ, గీతా యాదవ్, విజయలక్ష్మి, అమరేశ్ ట్రస్టు అధ్యక్షుడు మృత్యుంజయ బంద్రాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్ హెగ్డే



బళ్లారి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బళ్లారి జిల్లాకు చెందిన న్యాయవాది వెంకటేశ్ హెగ్డేను ఏఐసీసీ కమిటీ నియమించింది. వెంకటేశ్ హెగ్డే కాంగ్రెస్ పార్టీలో కీలకంగా ఉన్నారు. గతంలో ఆయన పార్టీలో అనేక పదవుల్లో ఉన్నారు. పార్టీలో కీలకంగా ఉన్న వెంకటేశ్ హేడ్డేకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శ హోదా కల్పిండంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.



పూతరాలిన మామిడి చెట్లు

పూతలేని మామిడి పంట

- ఆందోళనలో అన్నదాత

కంప్లి, ఏప్రిల్ 3: రోజురోజుకు ఎండవేడిమి ఎక్కువవుతుండటంతో మామిడి పంటను రైతులు పూర్తిగా నష్టపోనున్నారు. గతంలో ఉగాది సమయంలో మామిడి చెట్టు పూతతో అల్లుకుని పంట దిగుబడి ఎక్కువగా కనిపించేది. కానీ ఈ యేడాది చూడటానికి మాత్రం పూత అధికంగా ఉంటోంది. ఎండవేడిమి వల్ల పూత రాలి పోయి కేవలం చెట్టు మాత్రమే మిగిలి ఉందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది మామిడి పంట పూర్తిగా దెబ్బతినిందన్నారు. కొందరు కౌలు రైతులు కాపు కోసం ఎన్ని మందులు పిచికారి వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కౌలు కూడా కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. ఎండవేడిమికి పంటంతా ఎండిపోతోందన్నారు. ఈ ఏడాది మార్కెట్లో మామిడి దిగుబడి వచ్చే అవకాశం కనిపించలేదు. కాస్తో కూస్తో పండిన మామిడికి ధర ఎక్కువగా ఉంటుందన్నారు. కంప్లి పరిధిలోని సన్నాపురం, కంప్లి, ఎమ్మిగనూరు, సుగ్గినళ్లి, చిక్కజంతిగల్, కురుగోడు తదితర ప్రాంతాల రైతులు మామిడి దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందన్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తుకారాం విజయానికి కృషి



కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్‌ను సన్మానిస్తున్న అభిమానులు

కంప్లి, ఏప్రిల్ 3: కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తామని కుడితిని, వేణి వీరాపురం, అల్లీపురం గ్రామాల్లోని ఆయన అభిమానుల సంఘం నాయకులు తెలిపారు. తుకారామ్‌ను వేణి వీరాపురం వద్ద అభినందించి సన్మానించారు. రాష్ట్రంలోనే ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందుతారన్నారు. ఆయన గెలుపుతో జిల్లాలో అభివృద్ధి ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటికే బూత్‌స్థాయి నుంచి జిల్లాలో కార్యకర్తలు, అభిమానులు ఆయన గెలుపు కోసం శ్రమవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, రవి, శీన, నాగేష్, స్వామి, నాగరాజు, శర్మ పాల్గొన్నారు.

మూగజీవుల దాహం తీర్చండి



అంజనాద్రి పర్వతంపై వానరానికి వాటర్ బాటిల్‌తో నీటిని తాగిస్తున్న భక్తుడు

కంప్లి, ఏప్రిల్ 3: గ్రామాల్లో, అడవుల్లో ఉండే మూగజీవులు, పశుపక్ష్యాదులకు వేసవిలో దా హార్తిని తీర్చేందుకు నీటి తొట్టె లు ఏర్పాటు చేయాలని రవి శేఖర్ కోరారు. హంపి పుణ్యక్షే త్రం తదితర ప్రాంతాల్లో నెమళ్లు, కోతులు, కుందేళ్లు, ఉడుములు, ఎలుగుబంట్లు, తదితర ప్రాణులు వున్నాయి. అవి కొండల్లో ఎక్కువగా వుంటాయి. బయటకు వచ్చేందుకు ఎండవేడిమి వల్ల ఇబ్బందులు పడుతున్నాయి. జీవులు తిరిగే ప్రాంతాల్లో తొట్టెలను ఏర్పాటు చేయాలని పురాతత్వ శాఖ అధికారులకు ఆయన కోరారు. ఆలయాలకు వెళ్లిన భక్తులు చేతిలో బాటిళ్లను చూసి కోతులు తమ దాహార్తిని తీర్చాలని వారిని అర్థిస్తున్నాయి. దేవదాయ శాఖ పురాతత్వ శాఖ అధికారులు దేవాలయాల వద్ద, పర్యాటక కేంద్రాల వద్ద నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని కోరారు.

రెండు బస్సులు ఢీ.. డ్రైవర్ల పరిస్థితి విషమం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సులు

పావగడ, ఏప్రిల్ 3: లింగదహళ్లి నుంచి బెంగళూరుకు వస్తున్న కేఎస్ఆర్‌టీసీ బస్సు పావగడ నుంచి చిత్రదుర్గం వెళుతున్న మహదేవి అనే ప్రైవేట్ బస్సు కోటగుడ్డం వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో డ్రైవర్లు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ప్రమాదానికి ప్రైవేటు బస్సు డ్రైవర్ అతివేగమే కారణమని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద ధాటికి రెండు బస్సుల ముందు భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇద్దరి డ్రైవర్ల పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు డ్రైవర్లను 108లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హోసూరు జోన్

వందశాతం ఓటింగ్ లక్ష్యంపై జాగృతి

హోసూరు ఏప్రిల్ 3: లోకసభ సార్వత్రిక ఎన్నికల్లో 100 శాతం ఓటింగ్ లక్ష్యంగా ఎన్నికల అధికారులు జాగృతి నిర్వహించారు. కృష్ణగిరి జిల్లా హోసూరులోని దిన్నూరులో ప్రభుత్వ వృత్తి విద్యా సంస్థలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించి 18 ఏళ్ల పైబడినవారంతా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 600మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కృష్ణగిరి వ్యవసాయ ఉప సంచాలకులు పచ్చయ్యప్పన్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు కళా, కాళీముత్తు, బాలసుబ్రహ్మణ్యం, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎ.భువనేశ్వరీ, వ్యవసాయ అధికారిణి, ప్రభుత్వ వృత్తి విద్య ఉప సంచా లకులు శృతి తదితరులు పాల్గొన్నారు. జగన్నాథన్, విద్యాశాఖ అధికారులు జయప్రకాశ్ రావు, రవిశంకర్, సోము, ధనలక్ష్మి సెందిల్‌కుమార్, హోసూరు తమిళ్‌సెల్వన్ పాల్గొన్నారు. ఓటర్ హెల్ప్‌లైన్ ద్వారా ఓటర్లు తమ ఎపిక్ కార్డు నమోదు చేయడం ద్వారా తమ పోలింగ్ బూత్ ఏదో తెలుసుకోవచ్చునన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు.



జాగృతిలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

భార్యను హతమార్చిన భర్త



భారతి(ఫైల్)



భర్త మహేంద్రన్

హోసూరు(క్రైం) ఏప్రిల్ 3: హోసూరు సమీపంలో కుటుంబ కలహాల నేపథ్యంలో మద్యంమత్తులో భార్యను భర్త హతమార్చిన సంఘటన చోటు చేసుకుంది. బాగలూరు కోట ప్రాంతంలో నివసించే పూల వ్యాపారి మహేంద్రన్(34) కు హోసూరు సమీపంలోని తిప్పలం గ్రామానికి చెందిన భారతి(26)తో 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి పిల్లలు లేరు. మహేంద్రన్ మద్యానికి బానిస కావడంతో తల్లిదండ్రులు అతడిని సర్జాపుర ప్రాంతంలోని పునరావాస కేంద్రానికి తరలించి మద్యం మానేయడానికి చికిత్స అందించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు ఉండేవి. మంగళవారం రాత్రి ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. భారతిని కత్తితో గొంతు కోసి హతమార్చి మహేంద్రన్ తెల్లవారుజామున ఇంటి నుంచి పరారైయ్యాడు. ఘటనపై కుటుంబీకులు బాగలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు. బాగలూరు పోలీసులు పరారైన భర్త కోసం గాలిస్తున్నారు.

గుట్కా, మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

హోసూరు(క్రైం), ఏప్రిల్ 3: హోసూరు సమీపంలో కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న 352 ప్యాకెట్ల మద్యం, పొగాకు వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పలు చోట్ల సోదాలు జరుగుతున్నాయి. బుధవారం హోసూరు సమీపంలోని కర్నూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 352 కర్ణాటక మద్యం బాటిళ్లను కారుల్లో అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. హోసూరు ఉమాశంకర్ నగర్ ప్రాంతానికి చెందిన ధనపాల్ (52)ను అరెస్టు చేశారు. అదే విధంగా బాగూర్ చెక్‌పోస్టు వద్ద నల్లూరు పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడులో నిషేధించిన 252 కిలోల గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. అలేనత్తంకు చెందిన హరీశ్(30) ను అదుపులోకి తీసుకుని గుట్కాను, కారును స్వాధీనం చేసుకున్నారు.

తేనెటీగల దాడిలో ఒకరి పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న రైతు భాస్కర్

హోసూరు, ఏప్రిల్ 3: హోసూరు సరిహద్దులో కర్ణాటక లోని ఆనేకల్ తాలూకా ముత్యాలమడుగు అనే పర్యాటక ప్రదే శంలో సమీపంలోని సునవార గ్రామంలో ప్రైవేట్‌కు చెందిన మూడంతస్తుల భవనంలో మద్యం దుకాణం నడుస్తోంది. ఈ భవనంలో రెండో అంతస్థులో తేనెటీగల గూడు ఉండగా అనూహ్యంగా తేనెటీగలు గూడు చెదిరి ఆ ప్రాంతంలోని పలువురికి, రోడ్డుపై వెళ్లేవారందరికీ కుట్టాయి. పొలంలో పని చేస్తున్న తిమ్మారెడ్డి లక్ష్మణన్‌తో పాటు పలువురికి తేనెటీగలు కుట్టాయి. అలాగే దుకాణం వద్ద నిలబడిన భాస్కర్ (50)కు తేనెటీగలు కుట్టాయి. చుట్టుప్రక్కల వారు వెంటనే వారిని రక్షించి చికిత్స నిమిత్తం ఆనేకల్ ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. భాస్కర్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రాంతంలోని మద్యం దుకాణం వద్ద తేనెటీగల గూళ్లు ఉన్నాయి. అలాగే ఈ ప్రైవేట్ భవనంలో ఉన్న తేనెటీగల గూడును సురక్షితంగా తొలగించేలా అటవీశాఖ తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

అన్నమయ్య (వర్ధంతి)



పదకవితా పితామహుడైన అన్నమయ్య లేదా తాళ్ళపాక అన్నమాచార్యులు 1408 మే 22న కడప జిల్లా తాళ్ళపాక గ్రామంలో జన్మించారు. తెలుగు సాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు. గొప్ప వైష్ణవభక్తుడు. తిరుమల వెంకటేశ్వర స్వామి, అహోబిలం నరసింహస్వామి ఇతర దేవతలను కీర్తిస్తూ 32వేలకుపైగా కీర్తనలు రచించారు. ఆయన పాటలు, పదాలు, పద్యాలలో భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం, భావలాలిత్యం పెనవేసికుని ఉంటాయి. చందమామ రావే జాబిల్లి రావే..., జో అచ్యుతానంద జోజో ముకుంద వంటివి ఎంతో పేరొందాయి. 1503 ఏప్రిల్ 4న పరమపదించారు.

మార్టిన్ లూథర్ కింగ్ (వర్ధంతి)



మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ 1929 జనవరి 15న అమెరికా దేశం జార్జియా రాష్ట్రం అట్లాంటాలో జన్మించారు. సివిల్ రైట్స్ ఉద్యమ నాయకుడు. బాప్టిస్ట్ మినిస్టర్‌గా వ్యవహరించారు. మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకుని అహింసా మార్గంలో సాగారు. సదరన్ క్రిస్టియన్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్‌కు మొదటి అధ్యక్షుడిగా వ్యవహరించారు. మంచి వక్తగా, సంఘ సంస్కర్తగా గుర్తింపు పొందారు. నోబెల్ పురస్కారం అందుకున్నారు. 39వ యేట 1968 ఏప్రిల్ 4న హత్యకు గురయ్యారు. మరణానంతరం ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం గౌరవం ప్రకటించారు. అమెరికాలో ఆయన గౌరవార్థం జనవరి మూడో సోమవారాన్ని మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ డేగా ఆచరిస్తున్నారు.

మహమ్మద్ కులీ కుతుబ్ షా (జయంతి)



హైదరాబాద్ నగర నిర్మాతగా పేరొందిన కుతుబ్ షాహీ వంశం ఐదవ సుల్తాన్ అయిన మహమ్మద్ కులీ కుతుబ్ షా 1565 ఏప్రిల్ 4న జన్మించారు. చారిత్రాత్మక చార్మినార్‌ను నిర్మించింది ఆయనే. అరబ్బీ, పర్షియన్, ఉర్దూ, తెలుగు భాషలలో పాండిత్యం గలవాడు. ఉర్దూ సాహిత్య జగతిలో దీవాన్ గల మొదటి సుల్తాన్. ఇతడి దీవాన్ పేరు 'కుల్లియాత్ ఎ కుతుబ్ షాహి'. ఆయన తెలుగు రచనలూ కవితలు కూడా చేశాడు అయితే అందుబాటులో ఏవీ లేకపోవడం దురదృష్టకరం. 1612 జనవరి 11న కన్నుమూశారు.

పండిట్ మఖన్‌లాల్ చతుర్వేది (జయంతి)



పండిట్ మఖన్‌లాల్ చతుర్వేది 1889 ఏప్రిల్ 4న మధ్యప్రదేశ్ రాష్ట్రం హోషంగాబాద్ జిల్లా బాబాయ్ గ్రామంలో జన్మించారు. కవి, రచయిత, వ్యాసకర్త, నాటక రచయిత, జర్నలిస్ట్. దేశ స్వాతంత్ర్యం కోసం జాతీయ పోరాటంలో పాల్గొన్నందుకు ఛాయావాద్‌కు హిందీ సాహిత్యంలో ఎంతో కృషి చేశారు. హిందీలో తొలి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. 1963లో పద్మభూషణ్ గౌరవాన్ని అందుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయుడిగా వ్యవహరించారు. ప్రభా, ప్రతాప్, కర్మవీర్ జాతీయవాద పత్రికలకు ఎడిటర్‌గా వ్యవహరించి జైలుపాలయ్యారు. 1968 జనవరి 30న కన్నుమూశారు. ఆయన సేవలను గుర్తిస్తూ మధ్యప్రదేశ్‌లో యూనివర్సిటీకి పేరు పెట్టారు.

ఎన్నికల అధికారులమని చెప్పి ఉంగరాన్ని కాజేశారు

యాడికి, ఏప్రిల్ 3: ఎలక్షన్ అధికారులమని చెప్పి వెంకటసుబ్బయ్య అనే వృద్ధుని నుంచి ఇద్దరు దుండగులు బంగారు ఉంగరం కాజేసిన సంఘటన బుధవారం రాయలచెరువు వద్ద జరిగింది. పచ్చారు మేకలప ల్లికి చెందిన బాధితుడు బుధవారం మధ్యాహ్నం కూర్మాజీపేటలోని తన పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా రాయలచెరువులోని రైల్వేగేట్ వద్ద గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి తాము ఎలక్షన్ అధికారులమని చెప్పారని తెలిపారు. ఎన్నికల సమయంలో బంగారు ఉంగరాలు అన్ని ఇలా చేతులకు పెట్టుకోకూడదని చెప్పారు. వెంకటసుబ్బయ్య చేతికి ఉన్న బంగారు ఉంగరం, బ్యాంక్ పాసుపుస్తకం, సెల్‌ఫోన్ తీసుకొని ద్విచక్ర వాహనం బ్యాగులో పెడతామని తీసుకున్నారు. బ్యాంక్ పాసుపుస్తకం, సెల్‌ఫోన్ బ్యాగులో పెట్టి బంగారు ఉంగరం తీసుకొని పారి పోయారని వాపోయాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నీటిటబ్‌లో పడి చిన్నారి మృతి

పెద్దవడుగూరు, ఏప్రిల్3: మండలంలోని చింతలచెరువు గ్రామంలో నీటి టబ్‌లో పడి 13 నెలల చిన్నారి అఖిల్ బుధవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు చింతలచెరువు గ్రామానికి చెందిన రాధ, శివ దంపతులకు కుమార్తెతోపాటు కుమారుడు అఖిల్ ఉన్నాడు. ఇరువురు వ్యవసాయ పనులకు వెళుతూ జీవనం సాగించేవారు. బుధవారం చిన్నారి అఖిల్ ఇంటిలో నుంచి బయటకు వచ్చి ఆవరణలో ఆడుకుంటుండగా నీటిటబ్‌లో పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటి నుంచి బయటకు వచ్చిన తల్లి రాధ చిన్నారి అఖిల్‌ను వెదికింది. బాలుడు టబ్‌లో అపస్మారక స్థితిలో పడి ఉండటం చూసి హుటాహుటిన పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ప్రలోభాలపై యాప్ ద్వారా ఫిర్యాదు చేయండి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 3: ఎన్నికల వేళ ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే.. వాటి వివరాలతో కూడిన ఫొటోలను సి-విజిల్ యాప్‌లో అప్‌లోడ్‌చేసి ఫిర్యాదు చేయాలని అర్బన్ తహసీల్దార్ శివరామిరెడ్డి యువతకు సూచించారు. బుధవారం ఆర్ట్స్ కళాశాలలో ఓటర్ అవగాహన సదస్సును నిర్వ హించారు. ఇందులో శివరామిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి మాట్లా డుతూ.. ప్రతి విద్యార్థి పదిమందికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు పద్మావతి, జ్యోతి, ప్రసాద్, అచ్యుతానంద, ఎన్ఎస్ఎస్ అధికారులు విష్ణుప్రియ, సోమశేఖర్, రామకృష్ణ, పాల్గొన్నారు.

ముంగానహళ్లిలో ఓటుహక్కుపై చైతన్యం

చింతామణి, ఏప్రిల్ 3: తాలూకా స్వీప్‌సమితి ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై బుధవారం ముంగానహళ్ళి హోబళి బట్లహళ్ళి గ్రామ పంచాయతీ బస్టాండ్‌లో హోబళిస్థాయి జాథా నిర్వహించారు. తాలూకా స్వీప్ సమితి అధికారుల బృందం, అంగన్‌వాడి కార్యకర్తలు, గ్రామపెద్దలు, వివిధ పాఠశాలల విద్యార్థుల బృందాలు, చెక్క భజన బృందాలు పాల్గొని రామ-రావణ యుద్ధ సన్నివేశాలు, వివిధ జానపద సన్నివేశాలతో చైతన్యం కల్పించారు. బట్లహళ్ళి బస్టాండ్‌లో ప్రతిజ్ఞ చేయించారు. జాథాలో స్త్రీశక్తి సంఘాల సభ్యులు కూడా పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించారు. 18ఏళ్లు పైబడినవారంతా తప్పనిసరిగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి ఎస్ ఆనంద్ మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వేయాలన్నారు. నిర్భయంగా ఓటు వేయాలని పిలునిచ్చారు. జాథాలో బట్లహళ్ళి ఎస్ఐ, గ్రామపంచాయతీ పీడీఓ సత్యనారాయణ్, ఎం గొల్లహళ్ళి పీడీఓ నాగేశ్‌బాబు, ఊలవాడి పీడీఓ శివణ్ణ, కోటగల్ పీడీఓ భాగ్యమ్మ, ఇరగంపల్లి పీడీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



బస్టాండ్‌లో మానవహారంగా ప్రతిజ్ఞ

లోక్‌సభ ఎన్నికలు స్థానిక సంస్థలకు దిక్సూచి

బంగారపేట, ఏప్రిల్ 3: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు రానున్న జిల్లా, తాలూకా పంచాయతీ స్థానిక సంస్థల ఎన్నికలకు దిక్సూచి కానున్నాయని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. బుధవారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ చేయలేదని, అయితే శ్రీమంతులైన అంబానీ, అదానిలకు కోట్లాదిరూపాయల మాఫీ చేశారని ఆరోపించారు. ప్రత్యర్థులపై స్వతంత్ర్య దర్యాప్తుల ద్వారా వేధిస్తోందన్నారు. ఎన్నికల బాండ్లలోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. కాగా కరువుతో విలలాడున్నా రాష్ట్రానికి కనీస గ్రాంట్లు కేటాయించలేదన్నారు. ప్రస్తుతం అయోధ్య రామమందిరం అనే ట్రంప్‌కార్డ్‌ను ప్రయోగిస్తున్నారన్నారు. బరిలో జేడీఎస్-బీజేపీ మైత్రి అభ్యర్థి మల్లేశ్ బాబు మల్లేశ్‌బాబు ప్రత్యర్థిగా ఉన్నారని, ఆయన రెండుసార్లు శాసనసభ ఎన్నికల్లో ఓడారని ఆ తర్వాత నియోజకవర్గ ప్రజలను పట్టించుకోలేదని ఇప్పుడు ప్రజలను ఓట్లను అభ్యర్థించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సామాన్య కార్యకర్తగా ఉన్న కేవీ గౌతమ్ ఎంపీ అభ్యర్థి కావడం గొప్పవిషయమని, లోక్‌సభ ఎన్నికలు శ్రీమంత-పేదలకు మధ్య జరుగుతున్న పోరులా ఉందన్నారు. సమావేశంలో అభ్యర్థి కేవీ గౌతమ్, కాంగ్రెస్ జిల్లాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు పార్థసారథి, చందు, గోపాల్‌గౌడ, కేవీ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్, విశ్వనాథ్ మధ్య కుదిరిన రాజీ

బెంగళూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర టిక్కెట్ ఆశించి భంగపడి అసంతృప్తితో ఉన్న యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్‌ను బీజేపీ అభ్యర్థి డాక్టర్ సుధాకర్ భేటీ అయ్యారు. బుధవారం రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్‌తో కలసి సుధాకర్ నేరుగా విశ్వనాథ్ ఇంటికి వెళ్లారు. విశ్వనాథ్, సుధాకర్‌తోపాటు ఇన్‌చార్జ్‌ను శాలువాతో సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం చర్చలు జరిపారు. టిక్కెట్ రాలేదనే అసంతృప్తి ఉండేదని, అయితే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సూచనలకు అనుగుణంగా నరేంద్రమోదీ మరోసారి ప్రధాని అయ్యేందుకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. వ్యతిరేకత ఉండరాదని, కలసి పనిచేయాలని అమిత్‌షా సూచనలకు కట్టుబడ్డామన్నారు. యలహంకలో అత్యధిక మెజారిటీ తీసుకొచ్చేందుకు కట్టుబడతానని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ-జేడీఎస్ కార్యకర్తలు నాయకులతో కలసి ముందుకెళ్తామన్నారు.



రాధామోహన్‌దాస్, సుధాకర్‌లను స్వాగతిస్తున్న విశ్వనాథ్

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



సమావేశంలో మంత్రి రామలింగారెడ్డి తదితరులు

» రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి

బొమ్మనహళ్ళి, ఏప్రిల్ 3: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలు చేశామని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాల వల్ల ప్రతి కుటుంబం ఎంతోకొంత లబ్ధి పొందుతోందన్నారు. అభివృద్ధిని చూసి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. రాష్ట్రంలో సరైన వర్షాలు కురవక 236 తాలూకాల్లో కరువు నెలకొన్నా కేంద్రప్రభుత్వం కనీస సాయం ఇవ్వలేదని ఆక్రోశం వ్యక్తం చేశారని, కర్ణాటకపట్ల కేంద్రం తీరు సవతితల్లి ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రం నుంచి అత్య ,ధికంగా బీజేపీ ఎంపీలు ఉన్నా అభివృద్ధికి తగిన గ్రాంట్లు సాధించడంలో విఫల మయ్యారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందుతారన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మాజీ మేయర్ మంజునాథరెడ్డి, మాజీ కార్పొరేటర్ మునిరాజు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, కేశవ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

లండన్ నుంచి బెంగళూరుకు విమాన సేవలు

బెంగళూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లండన్ దేశం హిత్రూ నుంచి బెంగళూరుకు రోజువారీ వర్జిన్ అట్లాంటిక్ విమాన సేవలు అందుబాటులోకి తీసుకురావడం సంతోషమని బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సత్యకి రఘునా అభిప్రాయపడ్డారు. బుధవారం నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వర్జిన్ అట్లాంటిక్ సంస్థ సీఈఓ షాయ్‌వీజ్ మాట్లాడుతూ బెంగళూరు అంటే ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందన్నారు. ఐటీబీటీతోపాటు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతున్న బెంగళూరు, లండన్‌ల మధ్య నేరుగా రవాణా సౌలభ్యం ఉండాలనే సర్వీసులు ప్రారంభించామన్నారు. అక్టోబరు నుంచి ముంబైకు సేవలను ఆరంభించే ఆలోచన ఉందన్నారు. 2019 నుంచి వర్జిన్ అట్లాంటిక్ 350 సీట్ల సామర్థ్యం వృద్ధి చెందుతోందన్నారు. యునైటెడ్ స్టేట్స్ వెలుపల అతిపెద్ద అభివృద్ధి ప్రాంతాన్ని ఎంపిక చేసుకుంటున్నామన్నారు. కస్టమర్స్ ఫ్లైయింగ్స్‌తోపాటు ఫ్యాషన్, ఫార్మాస్యూటికల్స్, టెక్ రంగాలనుంచి వస్తువుల ఎగుమతులకు అనుగుణంగా కార్గో కార్యకలాపాలు ప్రోత్సహిస్తామన్నారు. వర్జిన్ అట్లాంటిక్ కార్గో 40మిలియన్ కిలోల స్థలాన్ని అందిస్తోందని, 2019తో పోలిస్తే 336శాతం సామర్థ్యం పెరిగిందన్నారు. బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ చంద్రు లేయర్ మాట్లాడుతూ యూకే, భారత్‌ల మధ్య వ్యాపార, ప్రయాణీకుల సామర్థ్యం పెరుగుతోందన్నారు. ఏప్రిల్ 1 నుంచే సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు.



ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సత్యకి రఘునా తదితరులు

సీపీఎం అభ్యర్థి నామినేషన్

బాగేపల్లి, ఏప్రిల్ 3: చిక్కబళ్ళాపుర లోక్‌సభ నియోజకవర్గానికి సీపీఎం అభ్యర్థి పీఎం ముని వెంకటప్ప బుధవారం నామినేషన్ సమర్పించారు. అభిమానులు, కార్యకర్తలతో కలసి ర్యాలీగా తరలి అనంతరం జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జీవీ రాఘవులు, యు బసవరాజ్, ఎస్ వరలక్ష్మి, డాక్టర్ అనిల్‌కుమార్, రఘురామరెడ్డి, వాల్మీకి అశ్వథప్ప, చన్నరాయప్ప, సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా సాగుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ఆలయ అభివృద్ధికి దాతల కోసం ఎదురుచూపు



ఆలయ పుష్కరిణి అభివృద్ధి పనులు

చేళూరు, ఏప్రిల్ 3: తాలూకాలోని బురడగుంట గ్రామపంచాయతీలోని పురాతన లక్ష్మీ వెంకట రమణ స్వామి ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు ముందుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆలయానికి తూర్పు దిక్కునగల స్వామివారి పుష్కరిణి అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బెంగ ళూరుకు చెందిన ఓ దాత హరీశ్ అనే భక్తుడు సుమారు రూ.3.5 లక్షల ఖర్చుతో పుష్కరిణి అభివృద్ధి కోసం పనులు చేపట్టారు. కొద్దిరోజులుగా పనులు చురుగ్గానే సాగుతున్నాయి. ఆలయానికి సమీపంలోనే పాపాఘ్ని నది కాలువ ఉంది. కాగా ఆలయానికి పడమటి ప్రధాన ద్వారంతో అందంగా నిర్మించినా పలు కారణాలతో ఆశించిన అభివృద్ధి జరగలేదు. ఈ నేపథ్యంలో పురాతనమైన ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు దాతలు మరింత ముందుకు రావాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆలయాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటకప్రాంతంగా రూపొందుతుందని అభిప్రాయపడ్డారు.

రంజాన్ కిట్ల పంపిణీ

బొమ్మనహళ్ళి, ఏప్రిల్ 3: రంజాన్ పండుగ సందర్భంగా బొమ్మనహళ్ళిలోని నవజీవన సంఘం అధ్యక్షురాలు హసీనా ఆధ్వర్యంలో సంఘం సభ్యులు, ఇతర కుటుంబాలకు రంజాన్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హసీనా మాట్లాడుతూ నవజీవన సంఘం పదేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. బడుగు బలహీనవర్గాలకు తగిన చేయూత ఇస్తోందన్నారు. విద్యను ప్రోత్సహిస్తున్నామని, టైలర్ ట్రైనింగ్ ఇస్తున్నామని, ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే ప్రతి పండుగల వేళ పేద, మధ్య తరగతి వర్గాలకు నిత్యావసరాలు ఇస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం రంజాన్ పండుగకు అవసరమైన బియ్యం, బేడలు, చక్కెర ఇతరత్రా 5 కేజీల చొప్పున కిట్‌గా ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.



నిత్యావసర కిట్‌లతో మహిళలు

రూ.5లక్షల నగదు స్వాధీనం



తనిఖీలు చేస్తున్న పోలీసులు

దొమ్మసంద్ర, ఏప్రిల్ 3: బెంగళూరు గ్రామీణ లోక్‌సభ పరిధిలో తమిళనాడు సరిహద్దున సర్జాపుర అబ్బయ్య సర్కిల్ వద్ద చెక్‌పోస్ట్‌లో రూ.5లక్షల నగదును ఎన్నికల అధికారులు స్వాధీనం చేసు కున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతం, ఇతర కీలక కూడళ్లలో తాత్కాలిక చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. తగిన ఆధారాలు లేకుండా భారీగా నగదు, ఇతర విలువైన వాహనాలు తరలించే అవకాశం లేదు. బుధవారం తెల్లవారుజామున తనిఖీల వేళ ఆటోలో రూ.5లక్షల నగదు గుర్తించారు. ఎటువంటి రికార్డులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్టు సర్జాపుర పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పీడీఓ సుభాన్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ మధు, వీసీ మల్లికార్జున, హోంగార్డ్ హరీశ్ ఉన్నారు. ఎన్నికల అధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళల పట్ల ఆకతాయి అసభ్య ప్రవర్తన

- ద్విచక్ర వాహనం స్వాధీనం
- పోలీసు స్టేషన్‌కు చేరిన పంచాయితీ

పామిడి, ఏప్రిల్ 3: మహిళల పట్ల ఓ యువకుడు కొద్ది రోజులుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు... పట్టణంలోని గుప్తా కాలనీ శివారు ప్రాంతంలోని కంపచెట్లలో ఓ యువకుడు గత కొద్ది రోజులుగా పొంచి ఉంటూ అటుగా నడుచుకుంటూ వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. పాఠశాలల నుంచి పిల్లలను ఇంటికి తీసుకువెళ్లే సమయంలో ఆ యువకుడు ఆ మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించేవాడు. ఆ ఆకతాయి చేష్టలకు విసుగుచెందిన మహిళలు బుధవారం అంతా కలిసి వెళ్లి పట్టుకునే ప్రయత్నం చేశారు. కానీ అతడు తప్పించుకొని పారిపోయాడు. అక్కడనే ఓ ద్విచక్ర వాహనం ఉండడంతో ఆ వాహనాన్ని మహిళలు కాలువలో పడేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి వచ్చి ఆ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ద్విచక్ర వాహనం యజమానిని విచారించి టన పోలీసులు పెట్రోలు లేక ఆగిపోవడంతో పెట్రోలు తీసుకువచ్చేందుకు వెళ్లడంతో నిర్లక్ష్యంతపోయాడు. స్టేషన్‌కు వెళ్లి బండి రికార్డులు చూపించి ఆ మహిళలతో విచారించి ఆ ద్విచక్ర వాహనంకు ఆ యువకునికి సంబంధం లేదని ద్విచక్ర వాహనం అందజేసినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా మాజీ మంత్రి వి.మునియప్ప



వీ మునియప్ప

శిడ్లఘట్ట, ఏప్రిల్ 3: శిడ్లఘట్ట నియోజకవర్గ సీనియర్ రాజకీయ నేత, మాజీ మంత్రి వీ మునియప్పకు కేపీసీసీ పదాధికారుల జాబితాలో కీలక హోదా దక్కింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీ ప్రక్షాళన చేపట్టిన సంగతి విదితమే. ఇందులో భాగంగా నాలుగు దశాబ్దాల అనుభవం కల్గిన మునియప్పకు కేపీసీసీ ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించింది. ఈమేరకు బుధవారం ఆయనను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

బెంగళూరు మెట్రో, ఏప్రిల్ 3: మద్యం మత్తులో బార్‌లో జరిగిన గొడవలో ఒక వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన బాణసవాడి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కత్తిపోటుకు గురైన వ్యక్తిని ఇమ్రాన్‌గా పోలీసులు గుర్తించారు. ప్రశాంత్, విజీర్ అనేవారు ఇమ్రాన్‌పై కత్తితో దాడికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. బార్‌లో ముగ్గురు వ్యక్తులు పక్కపక్కనే టేబుళ్లపై కూర్చుని మద్యం సేవిస్తుండగా వాగ్వాదం కాస్త దాడికి దారి తీసిందన్నారు. దాడికి పాల్పడిన ఇద్దరు పరారయ్యారన్నారు. బాధితుడిని బార్‌లో ఉన్నవారు స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. బాణసవాడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అదుపు తప్పిన వాహనం నుజ్జునుజ్జు



టోయింగ్‌వాహనంతో కారు తొలగింపు

దొమ్మసంద్ర, ఏప్రిల్ 3: అత్తిబెలె-సర్జాపుర ప్రధాన రహదారిపై ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కారు అదుపు తప్పి ప్రమాదానికి గురికావడంతో నుజ్జునుజ్జయ్యింది. మంగళవారం రాత్రి సుమారు 12 గంటలకు టోయింగ్ వాహనంతో సదరు కారును శ్రీరామవిల్లా అపార్ట్‌మెంట్‌వైపు మళ్లించారు. స్థానిక అపార్ట్‌మెంట్‌లోని ఏపీ వ్యక్తి మద్యపానం చేసి వాహనం నడపడంతోనే అదుపు తప్పిందని స్థానికుల ద్వారా తెలుస్తోంది. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదు.

శ్యామనూరు వ్యాఖ్యలపై... బీజేపీ మహిళా మోర్చా నిరసన

బెంగళూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే శ్యామనూరు శివశంకరప్ప బీజేపీ అభ్యర్థి గాయత్రి సిద్దేశ్వర్ పట్ల అనుచితంగా మాట్లాడిన మేరకు మహిళా మోర్చా కార్యకర్తలు వినూత్నంగా నిరసన తెలిపారు. బుధవారం దావణగెరెలోని జయదేవ సర్కిల్‌లో వంటలు చేసి ప్రజలకు పంచిపెట్టారు. బీజేపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మంజుళ నేతృత్వంలో వంటా వార్పు చేశారు. ఈ సందర్భంగా మంజుళ మాట్లాడుతూ మహిళల పట్ల అనుచితంగా మాట్లాడడం సరికాదన్నారు. ప్రస్తుతం దావణగెరె నుంచే ఆయన కోడలు ప్రభా మల్లికార్జున అభ్యర్థి అయ్యారని, ఆమె గతంలో ఏమైనా పదవులలో కొనసాగారా అని ప్రశ్నించారు. కాగా శ్యామనూరు శివశంకరప్ప బుధవారం ఎన్నికల కమిషన్‌కు వివరణతో కూడిన ఓ లేఖ పంపారు. దావణగెరె బీజేపీ అభ్యర్థి పట్ల ద్వేషంతో మాట్లాడాననే రీతిలో తప్పుడు ప్రచారం చేశారన్నారు. మహిళల పట్ల నేను ఎప్పుడూ చులకనగా మాట్లాడలేదన్నారు. మా పార్టీ అగ్రనేత ఇందిరాగాంధీ శక్తివంతమైన ప్రధానిగా రాణించారన్నారు. నా వ్యాఖ్యలను దారి తప్పించారని మండిపడ్డారు.

పింఛన్ల పంపిణీ వాయిదా

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 3: సామాజిక పింఛన్ల పంపిణీ వాయిదా పడింది. ప్రభుత్వం డబ్బులను బ్యాంక్‌లకు బుధవారం మధ్యాహ్నం జమ చేసింది. దీంతో సచివాలయ సిబ్బంది మధ్యాహ్నం 3గంటలకు డబ్బులను డ్రా చేసుకునేందుకు బ్యాంక్‌లకు వెళ్లారు. అక్కడ రద్దీ ఎక్కువగా ఉండటంతో డబ్బులను డ్రా చేసుకునేందుకు సాయంత్రం అయ్యింది. దీంతో సచివాలయ సిబ్బంది పింఛన్ల లబ్ధిదారులకు గురువారం ఉదయం నుంచి పంపిణీ చేస్తామని చెప్పారు. దివ్యాంగులు, తీవ్రఅనారోగ్యంతో ఉన్నవారికి, వితంతువులకు ఇంటివద్దే పింఛను సొమ్ము అందజేస్తామని సచివాలయ కార్యదర్శులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 3: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తు రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గుమ్మఘట్ట మండలంలోని భూపసముద్రం, రంగచేడు, వేదావతి హగరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా డిగ్రీ కళాశాల వద్ద వీటిని సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే డీ.హీరేహాళ్ మండలం హడగలి వద్ద సెబ్ అధికారులు రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పట్టణంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.